క్లుప్తంగా

అర్ధరాత్రి దామెర చెరువు మట్టి తరలింపు

- అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- సీఐపీపీఎల్ వాహనాలు (ఎమ్మెల్యే ధర్మారెడ్డి కంపెనీ) కావడంతో ఉద్రిక్తత



పరకాల : ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండానే పరకాల దామెర చెరువు నుంచి మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్న చల్లా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (సీఐపీపీఎల్) టిప్పర్లను కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. పరకాల స్మశాన వాటికకు చెరువు మట్టిని తరలిస్తున్నట్లు చెబుతూ టిప్పర్ల డ్రైవర్లు ఎదురు తిరగడంతో దామెర చెరువు వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న ఎస్సై హరికృష్ణ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని టిప్పర్లను స్వాధీనంలోకి తీసుకున్నారు. సీఐపీపీఎల్ వాహనాలు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి సంబంధించిన కంపెనీవి కావడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. దీంతో అర్ధరాత్రి వరకు దామెర చెరువు వద్ద ఉద్రికత్త వాతావరణం నెలకొంది.

పోస్టర్ల ప్రదర్శన



ఐనవోలు : రెండో దశ బడిబాటలో భాగంగా మండలంలోని ఉడుతగూడెంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థుల నుంచి ఆశించిన అభ్యసన ఫలితాలకు సంబంధించిన పోస్టర్లను తరగతి గదుల్లో సబ్జెక్టుల వారీగా మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చుంచుకాల లింగారావు మాట్లాడారు. ప్రస్తుత విద్యాసంవత్సరం విద్యార్థులు ఆయా తరగతుల్లో విషయాల వారీగా నేర్చుకోవాల్సిన అంశాలకు సంబంధించిన పోస్టర్లను తరగతి గదుల్లో ఏర్పాటు చేశామన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా వెంకటేశ్



ఎల్కతుర్తి : బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మండలంలోని వీరనాయణపూర్ గ్రామానికి చెందిన నార్లగిరి వెంకటేశ్‌ను నియమించినట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. తన మీద ఉన్న నమ్మకంతో పదవి అప్పగించారని చెప్పారు. జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతానికి, నియమ నిబంధనలకు కట్టుబడి క్రమశిక్షణతో పని చేస్తానని చెప్పారు.

గుడిసెల కూల్చివేత దుర్మార్గం

ఐనవోలు : పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేయడం దుర్మార్గమని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం పక్కన 10 ఎకరాల ప్రభుత్వ స్థలంలో పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తుండగా సదరు గుడిసెలను అధికారులు పోలీసుల భారీ బందోబస్తు నడుమ కూల్చారని చెప్పారు. అడ్డువచ్చిన గుడిసెవాసులపై లాఠీచార్జీ చేయడాన్ని ప్రజాసంఘాల ఐక్యవేదిక తరఫున ఖండించారు. ఇళ్లు లేని పేదలకు స్థలాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజాసంఘాల బస్సు యాత్ర ఈనెల 21న హనుమకొండకు చేరుకుంటుందని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

సంగెం : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. భరత్ తెలిపారు. సంగెం మండలంలోని ఓ గ్రామపంచాయతీ పరిధిలోగల తండాకు చెందిన బాలిక(15)పై అదే తండాకు చెందిన యువకుడు(20) పెళ్లిపేరుతో మాయమాటల చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడిపై లైంగిక దాడి, పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈ కేసును పర్వతగిరి సీఐ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

సంగెం : పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వృద్ధుడు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంగెం మండలం షాపూర్ గ్రామానికి చెందిన దొనికెన కుమారస్వామి(60) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని ఎంజీఎంలో చేర్చగా పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సీతారాములు తెలిపారు.

రైతును గెంటివేయడం సరికాదు



రాజబాబుతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత డాక్టర్ కృష్ణ

ధర్మసాగర్ : రుణమాఫీపై ఎమ్మెల్యేను నిలదీసిన రైతును గెంటివేయడం సరికాదని ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ బొల్లేపల్లి కృష్ణ అన్నారు. రైతు రుణమాఫీపై నిలదీసి పోలీసులతో గెంటివేయించబడ్డ మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన రైతు వజ్ర రాజబాబును కృష్ణ మంగళవారం కలిసి పరామర్శించారు. అనంతరం ఘటనపై రాజబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కృష్ణ మాట్లాడారు. ఇటీవల జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో రైతులకు రుణమాఫీ ఎప్పుడు వర్తింపజేస్తారంటూ రైతు రాజబాబు ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను నిలదీశారని చెప్పారు. ఈ క్రమంలో రాజబాబును పోలీసులతో ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యకు కార్యక్రమం నుంచి బయటికి గెంటివేయించారని తెలిపారు. బీఆర్ఎస్ నేతల నిరంకుశ పాలనలో ప్రశ్నించడమే నేరమైందన్నారు. సమస్యలపై ప్రశ్నించే గొంతును నొక్కడం, బయటకు గెంటివేయడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ప్రశ్నించే హక్కును కాలరాయడం ప్రజాస్వామ్యానికి విఘాతమన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను తీర్చే రోజు దగ్గర్లోనే ఉందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బేతి జయపాల్‌రెడ్డి, పుట్టపురి సదయ్య గౌడ్, అప్పని సంపత్, ఎల్లా గౌడ్, సురేశ్, కొరిమి సతీశ్, గై కృష్ణమూర్తి, తిరుపతిరెడ్డి, నారాయణ, భిక్షపతి, వీరన్న, వెంకటేశ్వర్లు, శ్రీధర్, శ్రీనివాస్, గోనెల సది, రాజేశ్, సృజన్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుమతి

ఐనవోలు : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ మార్నేని మధుమతి తెలిపారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ హబ్ సేవల్లో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన రక్త, మూత్ర పరీక్షల కేంద్రాన్ని మంగళవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం కోట్లాది రూపాయలు కేటాయిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. పీహెచ్‌సీల్లో అవసరమైన అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేయించడంతోపాటు మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సుమారు 50 రకాల వ్యాధులకు సంబంధించి రక్త, మూత్ర పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. పరీక్షల ఫలితాల ఆధారంగా వైద్యులు చికిత్స అందిస్తారని చెప్పారు. పేదలకు ఆరోగ్య సేవలు ఉపయోగపడుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఎంపీటీసీలు కొత్తూరి కల్పన, బోయినపల్లి సోమేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ అడ్డగూడి సతీశ్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ మునిగాల సంపత్, మహేందర్, సింగారం రాజు, మెడికల్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, పల్లె దవాఖాన డాక్టర్లు నవీన్, సరిత, పర్వీన్, సిబ్బంది సునంద, రాజేంద్రప్రసాద్, కృష్ణమూర్తి, సతీశ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

ఎల్కతుర్తి : ఆస్తి కోసం వదినను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన పురాణం స్వరూప భర్త జంపయ్య గత ఫిబ్రవరి నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని చెప్పారు. స్వరూపకు ఇద్దరు కొడుకులున్నారని తెలిపారు. ఆస్తి విషయంలో తన మరిది (భర్త తమ్ముడు) సమ్మయ్యతో గొడవలు జరుగుతున్నాయని వివరించారు. స్వరూప తన కొడుకుల, భర్త జంపయ్యకు వచ్చే ఆస్తి వాటా గురించి మాట్లాడుకుందామని చెప్పడంతో ఈనెల 11న ఆమె రాగా పెద్దమనుషుల సమక్షంలోనే కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో సమ్మయ్య విచక్షణరహితంగా దాడి చేశారని చెప్పారు. దీంతో స్వరూప అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. నిందితుడు సమ్మయ్యను మంగళవారం ఉదయం స్థానిక బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ఆస్తి కోసమే వదినను హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు పంపినట్టు సీఐ వివరించారు. సమావేశంలో ఎస్సై మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



ఎస్సైకి ఫోన్ అప్పగిస్తున్న మహేశ్

ఐనవోలు : ఉపాధ్యాయురాలికి పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు అప్పగించారు. ఎస్సై గుగులోత్ వెంకన్న కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కొడకండ్ల వాణి ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఆమె విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో ఫోన్ పోగొట్టుకుంది. కాగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేశ్ తన బైక్‌పై స్వగ్రామమైన నందనం గ్రామానికి వెళ్తుండగా అతడికి ఉపాధ్యాయురాలు వాణి పోగొట్టుకున్న ఫోన్ రోడ్డు మీద దొరికింది. దీంతో మహేశ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సైకి ఫోన్ అప్పగించారు. అనంతరం ఎస్సై విచారణ చేపట్టి ఫోన్ ఉపాధ్యాయురాలిదిగా గుర్తించి ఆమెను పిలిపించి అప్పగించారు. తాను పోగొట్టుకున్న సుమారు రూ.30 వేల విలువైన స్మార్ట్‌ఫోన్‌ను దొరకబట్టి ఇచ్చారంటూ ఎస్సైకి, మహేశ్‌కు ఉపాధ్యాయురాలు కృతజ్ఞతలు తెలిపారు. దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించడం పట్ల మహేష్‌ను ఎస్సై అభినందించారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త



మాట్లాడుతున్న ఏఓ పద్మ

ధర్మసాగర్ : విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పద్మ రైతులకు సూచించారు. మండల కేంద్రంలో రైతులకు, డీలర్లకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు విత్తనాలు కొన్నప్పుడు ఖచ్చితంగా రశీదు తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. ఏ కారణం చేతనైనా విత్తనం మొలకెత్తకపోతే డీలర్ ప్రశ్నించే అవకాశం ఉంటుందని చెప్పారు. విత్తనాలు కొనేటప్పుడు విత్తన ఉత్పత్తి తేదీ, గడువు, లాట్ నంబర్‌లను పరిశీలించాలని తెలిపారు. అలాగే రశీదుపై డీలరు, రైతు సంతకాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే విత్తనాల ధర ఎమ్మార్పీకి మించొద్దన్నారు. స్టాక్‌ను రకాల వారీగా బ్లాక్ బోర్డులో డిస్‌ప్లే చేయాలని, లైసెన్స్ లేకుండా విత్తనాల విక్రయం నేరమని తెలిపారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు షాపుల్లో ఉండడానికి వీల్లేదని చెప్పారు. నకిలీ, గడువు ముగిసిన, నిషేధిత విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తేటతెల్లం చేశారు. సదస్సులో ఏఈఓ నవ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డు లెనిన్, రైతుబంధు సమితి డైరెక్టర్ రేమిడి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



యోగా సాధన చేస్తున్న స్థానికులు

పరకాల : యోగాతో మానసిక ఒత్తిడికి దూరం కావచ్చని ప్రముఖ యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్ రావు తెలిపారు. ఈనెల 21 యోగా డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 10 రోజుల యోగా శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలోని జీవనశైలిలో అనేక మార్పులు చోటు చేసుకోవడంతో ఆర్థిక, సామాజిక, కుటుంబపరమైన సమస్యలు తలెత్తి చాలా మంది మానసిక ఒత్తిడికి గురై గుండెపోటు బారిన పడుతున్నారని తెలిపారు. శరీరానికి అవసరమైన వ్యాయామం లేకపోవడం ప్రమాదకరంగా మారిందని చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు సెల్ నంబర్ 9908224512లో సంప్రదించాలని లేదా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జరిగే యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్తమ సూపర్‌వైజర్లకు సన్మానం



సూపర్‌వైజర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్

శాయంపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఉత్తమ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లుగా మండలంలో విధులు నిర్వహిస్తున్న సునీత, మంజుల ఎంపికయ్యారు. వారిని భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి, జిల్లా కలెక్టర్ మెమోంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే శాయంపేట సెక్టార్ పరిధిలోని గట్లకనిపర్తి, ప్రగతి సింగారం అంగన్‌వాడీ టీచర్లు టీచర్ సత్యవేని, పద్మజ ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లుగా అవార్డు అందుకున్నారు.

కనుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠ



శాయంపేట : పూజ చేస్తున్న భక్తులు



ఎల్కతుర్తి : విగ్రహాల పూజ చేస్తున్న పండితులు



ఐనవోలు : బోనాలతో వస్తున్న మహిళలు, జనం

శాయంపేట : మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో శ్రీగణేశ్, శివపంచాయతన, శ్రీ అభయాంజనేయ, వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య, నవగ్రహ, నాగేంద్రస్వామి, గ్రామదేవత ప్రతిష్ఠాపన మంగళవారం రెండో రోజు కనుల పండువగా సాగాయి. ఈ సందర్భంగా ఉదయమర్రి కృష్ణమూర్తి శర్మ, గ్రామ పురోహితుడు గూడ వాసుదేవమూర్తి శర్మ ఆధ్వర్యంలో ఆయన శిష్యుల వేద మంత్రోచ్ఛారణల నడుమ సామూహిక హోమాలు, ఫల పుష్పాదివాసములు, ధాన్యాదివాసం, కుంకుమపూజ నిర్వహించారు. నేడు (బుధవారం) ఉదయం 7.20 గంటలకు దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త చకిలం విజయలక్ష్మీ-రవీందర్, సర్పంచ్ త్రిపురాల లక్ష్మీ, ఉపసర్పంచ్ గోనె నాగరాజు, ఆలయ కమిటీ చైర్మన్ చెల్ల లక్ష్మణరావు, వైస్ చైర్మన్ పెంతల నరేందర్, సభ్యులు మల్లయ్య, రాజు, నాగరాజు, కృష్ణ, శ్రీను, రవి, రాజేందర్, పాల్గొన్నారు.

బీజేపీ నేత కీర్తిరెడ్డి పూజలు

విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ చందుపట్ల కీర్తిరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత ఆమెకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆమె వెంట ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, మండల అధ్యక్షుడు గడ్డం రమేశ్, బీజేవైఎం మాజీ అధ్యక్షుడు తాటికొండ రవికిరణ్, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాయకులు పాషా, సుమన్, రమణారెడ్డి, స్వరూప, సంజీవరావు, రాఘవేంద్ర శర్మ, స్రవంతి, రవి, శ్రీను, నాగరాజు, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేటలో..

ఎల్కతుర్తి : మండలంలోని పెంచికలపేట గ్రామంలో శ్రీభక్తాంజనేయ సమేత రామలింగేశ్వర స్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం వేద పండితులు వేదస్వస్తి, గోపూజ, మంటప పూజలు, నిత్య హోమాలు, మృతాధివాసం, ధాన్యాధివాసం, ఫలాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం, హారతి, మంత్రపుష్పం, రాజోపచార పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ సామెల జమున సురేశ్ దంపతులు, ఎంపీటీసీ చెవుల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలో ముదిరాజ్ కులస్తులు రేణుకా ఎల్లమ్మ బోనాలు ఘనంగా సమర్పించారు. గతేడాది రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని ప్రతిష్ఠించగా తొలి వార్షికోత్సవాన్ని ముదిరాజ్ కులస్తులు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం పెద్దమ్మ తల్లికి అభిషేకం, బోనాలు సమర్పించారు. మంగళవారం రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించి సాయంత్రం సామూహికంగా డీజే, డప్పుచప్పుళ్లతో మహిళలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్ద కాటబోయిన కుమారస్వామి, ముదిరాజ్ సంఘం చైర్మన్ గూబ వీరస్వామి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టీసీ డిపో ఎదుట గేట్ ధర్నా



డిపో గేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

పరకాల : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) జిల్లా ప్రచార కార్యదర్శి బీరెల్లి శంకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం గేట్ ధర్నా నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులపై అధికారులు, యాజమాన్యం వేధింపులకు పాల్పడుతున్నట్టు తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించడం లేదని, రెండు పే స్కేల్స్, రెండు డీఏలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మికులపై వేధింపులు మానుకోవడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, పేస్కేల్, డీఏ ఇవ్వాలని, సీసీఎస్‌కు బాకీ ఉన్న డబ్బులు వెంటనే చెల్లించాలని, ఆర్టీసీలో గుర్తింపు సంఘాలకు ఎన్నికల నిర్వహణకు అనుమతించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ డిపో కమిటీ సెక్రెటరీ బొట్ల మహేందర్, నాయకులు మోహన్, భాస్కర్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం.. ఇల్లు దగ్ధం



నడికూడ : ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుని ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని నర్సక్కపల్లె గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోంపెల్లి శంకర్‌రావు ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంటలు వ్యాపించడంతో స్థానికులు పరకాలలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రితోపాటు ఇల్లు దగ్ధం కావడంతో రూ.2 లక్షల విలువైన ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు.

త్వరలో గొర్రెలకు టీకాలు



ఆత్మకూరు : నీలి నాలుక (బ్లూ టంగ్) వ్యాధి నివారణ కోసం త్వరలో గొర్రెలకు టీకాలు పంపిణీ చేయనున్నట్టు మండల పశు వైద్యాధికారి డాక్టర్ ధర్మానాయక్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గొర్రెల్లో నీలి నాలుక నివారణ కోసం అవసరమైన టీకాలు ప్రభుత్వం నుంచి వచ్చాయని, అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎండలు తగ్గిన అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లోని జీవాలకు టీకాలు వేయనున్నట్టు చెప్పారు. గొర్రెల పెంపకందారులు ప్రైవేట్‌గా టీకాల కొనుగోలు చేయొద్దని సూచించారు. తద్వారా ఆర్థికంగా నష్టపోవద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని గొర్రెల సంఖ్యకు అనుగుణంగా నీలి నాలుక నివారణ టీకాలు పంపిణీ చేస్తోందని వివరించారు.